క్లుప్తంగా

పేదలకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం నిరుపేదలకు అన్నదానం, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హనుమంతరావు, సరస్వతి, బ్రహ్మదేశం వసంతకుమార్, కొండాయగుంట రాము, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆధ్వర్యాన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం పాల్గొని కార్మికులకు వస్త్రాలు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తమవంతు బాధ్యతగా సంక్రాంతి పురస్కరించుకుని నూతన వస్త్రాలు అందజేస్తున్నట్లు సత్యం తెలిపారు. డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు అంగిరేకుల విజయ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన అంకమ్మతల్లి వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు ఆధ్వర్యాన లోక కల్యాణార్థం గణపతి హోమం, గణపతి పూజ, గోపూజ, సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

కాపులంతా ఐక్యంగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కాపులంతా ఐక్యంగా ఉండాలని కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. 62వ డివిజన్‌లో శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాపులంతా ఐక్యంగా ఉంటూ ఏకతాటిపై నడవాలని సూచించారు. అనంతరం 62వ డివిజన్ ప్రజా కాపునాడు అధ్యక్షుడిగా వడ్లమూడి సాయికుమార్‌ను నియమించి అతనికి నియామక పత్రం అందజేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 39 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పేటలో తనిఖీ నిర్వహించగా, కోలా సరోజిని అనే మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమెను అరెస్ట్ చేసి 9 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇక వైఎస్సార్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న కొణదల సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 30 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

శరవేగంగా రహదారుల పనులు





అయోధ్యనగర్ సీకే రెడ్డి రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 32వ డివిజన్ అయోధ్యనగర్ సీకే రెడ్డి, బీఆర్‌టీఎస్ రోడ్లలో రూ. 40 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి రోడ్లు పాడవ్వటంతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి మరమ్మతులకు అవసరమైన రూ. 40 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. సీకే రెడ్డి రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు సైతం వేశారు. రోడ్డు మధ్యలో గ్రీనరీని కూడా అభివృద్ధి చేస్తున్నారు. అలాగే బీఆర్‌టీఎస్ రోడ్డులో మీసాల రాజారావు వంతెన నుంచి పడవలరేవు సెంటర్ వరకు రూ. 20 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇటీవల వర్షాలకు కృంగిన ప్రాంతాల్లో కూడా మరమ్మతులు చేస్తున్నారు. రోడ్డు పనులు వేగంగా జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..



నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నిత్యం రద్దీగా ఉండే సీకే రెడ్డి రోడ్డును సుందరంగా తయారు చేశాం. అలాగే బీఆర్‌టీఎస్ రోడ్డులో మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నాం.

– మల్లాది విష్ణు, ఎమ్మెల్యే

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్ కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలను సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న మహిళలను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బంకా భాస్కర్, ఉద్దంటి సురేష్, బెవర నారాయణ, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, డివిజన్ నాయకులు కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుమారుడిగా రంగనాథస్వామి



శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన రంగనాథ స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అలాగే శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం స్వామివారికి కల్యాణం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్య శ్రీహరి తెలిపారు.

మధురానగర్‌లో..

మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. మందిర వ్యవస్థాపకుడు పీవీఎల్ఎన్ రాజు, లక్ష్మీతులసి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గోదారంగనాథ కల్యాణం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మందిర వ్యవస్థాపకుడు రాజు కోరారు. కార్యక్రమాలను సత్యప్రసాద్, కోనేరు మంజుల రాణి, మలిశెట్టి బాలవర్ధనరావు తదితరులు పర్యవేక్షించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



అంబేడ్కర్ చిత్రపటాలను ప్రదర్శిస్తున్న శరత్‌బాబు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు పేర్కొన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని మూడుబొమ్మల సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీతో కలిసి శనివారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిఒడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రూ. 404 కోట్లతో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకతాటిపై నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటాలను స్థానికులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు హైమావతి, నాగిరెడ్డి, దుర్గా, కె.జ్యోతి, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేళ్ల సంగీతబాబు, సహాయ కార్యదర్శి థామస్, మిట్ట నాగార్జున, యోహాను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తరలిరావాలని...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం పిలుపునిచ్చారు. శనివారం స్మృతివనాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్‌ను గుండెల్లో పెట్టుకుని ఆయన విధానాలను అనుసరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుభాషిణి, బహుజన నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అయోధ్య మందిరం నమూనా ముగ్గు



అయోధ్య రామమందిరం నమూనా ముగ్గు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం వద్ద తీర్చిదిద్దిన అయోధ్య రామమందిరం నమూనా ముగ్గు చూపరులను ఆకట్టుకుంది. అయోధ్య రామమందిరంతో పాటు శ్రీ సీతారామ, లక్ష్మణ సమేత హనుమంత చిత్రాలను ముగ్గులో వేశారు. అలాగే ఈ నెల 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని ముగ్గు ద్వారా సందేశం ఇచ్చారు.

పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవార్లకు భోగి పళ్లు పోస్తున్న అర్చకులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం నుంచి సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. భోగి పండగను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ దర్శనం ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు వాహనపూజలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు.

గ్రామంలోని భక్తులతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మీ, శ్రీ వెంకమ్మ తల్లి, శ్రీ వినుకొండ వెంకమ్మ తల్లి విగ్రహాలకు భోగి పండ్లను పోశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ మకర సంక్రాంతి, కనుమ పండగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఆలయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరం వద్ద వాహన పూజలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నసంతర్పణకు రూ.35వేల విరాళం

సంక్రాంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈ నెల 20న ఆలయంలో నిర్వహించే అన్నసంతర్పణకు కోన నాగేశ్వరరావు మనువరాలు విన్నకోట నాగ వెంకట సాయి భావన రూ.35వేల విరాళాన్ని ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరికి అందజేశారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: శ్రీ వీణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల సందర్భంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు యశస్వి ఆధ్వర్యంలో అమర గాయకులు ఘంటసాల, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, బహుభాషా గాయకుడు జేసుదాసు గానం చేసిన చిత్రగీతాలను సత్యస్వాతి, రాజుతోపాటు పలువురు గాయనీ గాయకులు ఆలపించారు.

వికలాంగుల పెన్షన్ పెంచాలని వినతి



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్‌ను ఆరువేల రూపాయలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గంటేడి సుజాతనాయుడు(వీహెచ్‌పీఎస్) కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజని సుజాత నాయుడు, వికలాంగుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దాసరి గోవర్ధన్ కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ మూడు వేల రూపాయలను అందజేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. వికలాంగులకు ఇంటి స్థలాలు, అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించండి

యూపీహెచ్‌సీ వైద్యులతో డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



యూపీహెచ్‌సీలో వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జబ్బు చేసి చికిత్స కోసం వచ్చిన ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. శనివారం ఆమె నగరంలోని లబ్బీపేట, గిరిపురం, గులాం మొహిద్దీన్‌నగర్, అయోధ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్యులు విధుల్లో ఉన్నారా, సేవలు ఎలా అందిస్తున్నారు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత కాలంలోగా టీకాలు వేసుకునేలా చూడాలన్నారు. ఎవరూ వ్యాక్సిన్ వేసుకోకుండా పెండింగ్ ఉండకుండా చూడాలని ఆదేశించారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం తగదని, రెగ్యులర్‌గా విధుల్లో లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పలువురు ప్రోగ్రామ్ అధికారులు ఉన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం పరిశీలన



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో ఈ నెల 19వ తేదీన అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంబేడ్కర్ స్మృతివనం రాష్ట్రానికి మైలురాయి కాబోతుందని, ఇప్పటికే నగరానికి మకుటంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితమిస్తారని చెప్పారు. ప్రారంభ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన ఫౌంటేన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు.

సమాజ సేవలోనే నిజమైన సంతృప్తి



తోపుడుబండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవలోనే నిజమైన సంతృప్తి ఉందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మల్లాది వేంకట సుబ్బారావు–సుందరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 మంది వీధి వ్యాపారులకు శనివారం తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని, మనకు ఉన్నదాంట్లోనే లేనివారికి సాయం చేయాలని సూచించారు. మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో 2013లో ఛారిటబుల్ ట్రస్ట్‌ను నెలకొల్పి దశాబ్ద కాలంగా నిరుపేద కుటుంబాలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా దయనీయ జీవనాన్ని గడుపుతున్న పలువురు పేదలను గుర్తించి.. వారి జీవనోపాధి నిమిత్తం తోపుడు బండ్లను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో గూగుల్ వైస్ ప్రెసిడెంట్



గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌ని సత్కరిస్తున్న గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రానికి విచ్చేసిన గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్‌తో కలిసి ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శనివారం దర్శించుకున్నారు. తిరుమలలో స్వామివారి దర్శనం చేయించిన తర్వాత టీటీడీ డైరీ, స్వామివారి ప్రసాదాన్ని చంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం గౌతంరెడ్డి తోట చంద్రశేఖర్‌ని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

బహుముఖ ప్రతిభాశాలి సాయి ప్రజ్ఞ



సాయి ప్రజ్ఞను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సాయి ప్రజ్ఞ అని బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత కళాకారిణి సాయి ప్రజ్ఞకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ సాయి ప్రజ్ఞ బాల్యం నుంచే శాస్త్రీయ సంగీతంలో ప్రతిభను కనబర్చారన్నారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు మాట్లాడుతూ.. సంస్థ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, బోడి ఆంజనేయరాజు, కొప్పుల ఆనంద్ తదితరులు ప్రసంగించారు. నిర్వాహకులు సాయి ప్రజ్ఞను ఆత్మీయంగా సత్కరించారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు విష్ణు ప్రియ, రూపశ్రీ, జయప్రభ, శ్రీధర్, రాజు, సత్యవర్ధన్, రసూల్‌బాబు, దిలీప్ పలు క్లాసికల్ గీతాలను ఆలపించారు.

మండల దీక్ష పారాయణ ప్రారంభం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీలలిత సహస్రనామ మండల దీక్ష పారాయణం శనివారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 23వ తేదీన జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని మండల దీక్షను చేపట్టారు. తొలుత కాసరనేని బాబూరావు, బేబిసరోజిని దంపతులతో కలశ స్థాపన ద్వారా మండల దీక్షకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. రోజూ సాయంత్రం ఏడు గంటలకు శ్రీతిరుపతమ్మ మాతృమండలి సభ్యులతో శ్రీలలిత సహస్రనామ పారాయణం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలి



పెనమలూరు: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా సకాలంలో వేయాలని కృష్ణా జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ అన్నారు. పెనమలూరు సచివాలయం–2 పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు వేసే ప్రక్రియను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను అవసరమైతే పెంచి సకాలంలో టీకాలు వేయలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో కూడా మందులు సకాలంలో పంపిణీ చేయాన్నారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ సర్వే చేసి వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు స్వాధీనం

రామవరప్పాడు: వేర్వేరు కారుల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును పటమట పోలీసులు శనివారం ఎనికేపాడు పార్కింగ్ ప్లేస్ వద్ద పట్టుకున్నారు. ఈ విషయంపై పటమట సీఐ కాశీవిశ్వనాథ్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు పటిష్టం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఎనికేపాడులో తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న కారులో తెలంగాణ మద్యం 15 ఫుల్ బాటిల్స్, 63 క్వార్టర్ బాటిల్స్ పట్టుబడ్డాయన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతున్న కారులో తగిన ఆధారాలు చూపకుండా తరలిస్తున్న రూ.10 లక్షలను కూడా గుర్తించినట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును స్వాధీనపరచుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలపై పూర్తి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.